క్లుప్తంగా

బీజేపీలో పలువురు చేరిక



పార్టీలో చేరిన వారితో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

యాచారం: బీఆర్‌ఎస్ నాయకురాలు, నల్లవెల్లి మాజీ సర్పంచ్ శోభ, ఆమె భర్త బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రాములు, పలువురు కార్యకర్తలు ఆదివారం నగరంలోని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి సమక్షంలో కాషాయం కండువా కప్పుకొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భూపాల్‌గౌడ్, యాచారం మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ అభయాంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో పది, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు మాధవి, అశోక్, చందన, కిశోర్, వైష్ణవి, ధృవాంశలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్యనారాయణ, సత్తయ్య, సాయికుమార్, మురళీధర్, పరమేశ్, సుధాకర్, లింగం, ఈశ్వరయ్య, లింగప్ప, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ విస్తరణకు చర్యలు

కందుకూరు: మండలంలోని లేమూరు పరిధిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు నిర్వాహకులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రముఖ స్థపతి శివనాగిరెడ్డి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ విస్తరణకు చేయాల్సిన పనుల గురించి మాట్లాడారు. ప్రస్తుతం దేవాలయాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం తీర్చిదిద్దేలా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆలయ నిర్వాహకులు ఆయన్ని కోరారు. అందులో భాగంగా మహా మండపం, ధ్వజస్తంభం, బలిపీఠం, రాజగోపురం, కోనేరులను తిరిగి నిర్మించాల్సి ఉంటుందని ఆలయ నిర్వాహకులకు శివనాగిరెడ్డి తెలిపారు. ఆయన వెంట ఆలయ నిర్వాహకులు గూడూరు కొండారెడ్డి, ఢిల్లీ బాలకృష్ణ, రావిచెట్టు ఐలయ్య, ఢిల్లీ గణేష్, కేశిడి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ఠాణా తరలింపు..

ఫార్మాసిటీ భద్రత కోసం నక్కర్తమేడిపల్లిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను కుర్మిద్దకు తరలించనున్నారు. అందరికీ అనుకూలంగా గ్రామాలకు మధ్య ఠాణా ఉండే విధంగా అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. త్వరలో తాత్కాలిక భవనంలోకి మార్చనున్నారు.

- కుర్మిద్ద తాత్కాలిక భవనంలోకి మార్పు
- ప్రస్తుతం నక్కర్తమేడిపల్లిలో కొనసాగుతున్న పీఎస్
- మార్చొద్దని గ్రామస్తుల ఆందోళన



నక్కర్తమేడిపల్లిలో కొనసాగుతున్న ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్

యాచారం: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా భూ సేకరణకు శ్రీకారం చుట్టింది. దీనిని వ్యతిరేకిస్తూ.. రైతులు ఆందోళనలు చేశారు. నిరసన కార్యక్రమాలు పెరుగుతున్న నేపథ్యంలో ఫార్మా భద్రతకు స్థానికంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అనుకున్నదే తడవుగా.. ఫార్మా భూములు సేకరించిన యాచారం, కందుకూరు మండలాల పరిధి 20 గ్రామాలు, వాటి అనుబంధ గ్రామాలను కలుపుతూ రాచకొండ కమిషనరేట్ పరిధి నక్కర్తమేడిపల్లిలో అద్దె భవనంలో 'హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణా'ను ఏర్పాటు చేసింది. ఒక సీఐ, ఎస్‌ఐలు, 30 మంది పోలీస్ సిబ్బందిని నియమించింది. ప్రస్తుతం పోలీసు పహారాలో నెల రోజులుగా ఫార్మా భూముల సర్వే, ఫెన్సింగ్ పనులు కొనసాగుతున్నాయి.

పదిరోజుల్లో..

ఫార్మాసిటీ పీఎస్‌ను యాచారం మండలం కుర్మిద్దకు తరలించనున్నారు. గతంలో పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేసిన భవనంలోకి మార్చనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు జరుగుతుండగా.. సీఐ లిక్కి కృష్ణంరాజు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజులు ఈ భవనాన్ని పరిశీలించారు. మరో రెండు మూడు రోజుల్లో పనులు పూర్తి కానుండగా.. పది రోజుల వ్యవధిలో పీఎస్‌ను మార్చేందుకు పోలీస్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

'నెట్ జీరో సిటీ'గా..

గత ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్.. అవే భూముల్లో ఫ్యూచర్ సిటీకి శ్రీకారం చుట్టింది. అయితే ఫార్మాను రద్దు చేసి, ఠాణా పేరు అదే ఉంటే ప్రజలు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని భావించిన పోలీసు యంత్రాంగం.. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌ను పేరును 'నెట్ జీరో సిటీ పీఎస్'గా మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. దీంతో కుర్మిద్దలోనూ పూర్వ పేరుతో ప్రజలకు సేవలు అందించాలని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. నక్కర్తమేడిపల్లి నుంచి పోలీస్ స్టేషన్ తరలించవద్దని ఆ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




కుర్మిద్దలోని పీఎస్ ఏర్పాటుకు తాత్కాలిక భవనం

అందరికీ అందుబాటులో..



ఫార్మాసిటీ పీఎస్‌ను అందరికీ అందుబాటులో ఉండే విధంగా యాచారం మండలం మధ్యలో ఉన్న కుర్మిద్ద గ్రామానికి మార్చబోతున్నాం. అక్కడి తాత్కాలిక భవనంలో పీఎస్‌కు తగిన ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. పది రోజుల్లో ఠాణాను తరలిస్తాం. ఫార్మా పీఎస్‌ను నెట్ జీరో సిటీగా పేరు మార్చేందుకు ప్రభుత్వానికి ప్రపోజల్ పంపించాం.

– లిక్కి కృష్ణంరాజు, సీఐ, ఫార్మాసిటీ పీఎస్



ఇబ్రహీంపట్నం: అంజలి ఘటిస్తున్న విద్యార్థులు

వీర జవాన్లకు ఘన నివాళి



ఆమనగల్లు: మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



ఆమనగల్లులో.. పూజలు

- కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి
- జవాన్ కుటుంబీకులకు పరామర్శ

ఇబ్రహీంపట్నం: పాకిస్తాన్‌తో పోరాడి వీరమరణం పొందిన జవాన్లకు ఇబ్రహీంపట్నంలోని ఏబీసీడీ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తులతో అంజలి ఘటించారు. జవాన్లు మురళీనాయక్, సచిన్‌యాదవ్, రావ్ వనాంజేల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ ప్రజల భద్రతకు ప్రాణాలను పణంగా పెట్టిన జవాన్ల త్యాగాలను దేశం ఎన్నటికీ మరిచిపోలేదని అకాడమి మాస్టర్ ముత్యం అన్నారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్స్ సురేశ్, బన్నీ, తారలు పాల్గొన్నారు.

పరామర్శ

ఆమనగల్లు: భారత్, పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులు మురళీనాయక్ కుటుంబ సభ్యులను ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాకు చెందిన పలువురు గిరిజన సంఘం, సేవాలాల్ సంఘం నాయకులు పరామర్శించారు. ఆంధ్రప్రదేశ్ సత్యసాయిజిల్లా పెనుగొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధి గోరంట్ల మండలం కల్లితండాల్లో ఆదివారం జవాన్ కుటుంబీకులను గిరిజన నాయకులు నేనావత్ రవీందర్‌నాయక్, శంకర్‌నాయక్, దశరథ్‌నాయక్, దేవీలాల్, ప్రకాశ్‌లు పరామర్శించారు. మురళీ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

పూజలు

సైనికుల క్షేమం కోసం ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో ఆదివారం ఆలయ పూజారి రామకృష్ణశర్మ నేతృత్వంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో బీజేపీ మాజీ కౌన్సిలర్ సుందూరి శేఖర్, నాయకులు లక్ష్మణ్, రవిరాథోడ్, ప్రశాంత్, ఎర్రవోలు మహేశ్, జగన్‌రెడ్డి, పవన్ కల్యాణ్, సాయిబాబా, శ్రీనివాసాచారి, రామస్వామి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి న్యామతాపూర్ గ్రామానికి చెందిన సంతోజు పరిపూర్ణచారి ఆరోగ్య సమస్యలతో నగరంలోని కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అనంతరం వైద్య ఖర్చుల సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఎమ్మెల్యే కసిరెడ్డి సహకారంతో బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.82 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం బాధితుడికి.. ఎమ్మెల్యే కసిరెడ్డి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బోదాస్ మహేశ్ తదితరులు ఉన్నారు.



మంచాల: బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నాయకులు

మంచాలలో..

మంచాల: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ కొర్ర శ్రీనివాస్ నాయక్ అన్నారు. అనారోగ్యంతో ఇటీవల చనిపోయిన లోయపల్లిగ్రామ వాసి తోడుసునూటి లచ్చులుకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయం కింద ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో రూ.60 వేలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు ఆదివారం లోయపల్లిలో బాధిత కుటుంబీకులకు చెక్కు అందజేశారు. ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాం దాస్, నాయకులు రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ఆమనగల్లు: ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఈ నెల 12న వాహనాలను వేలం వేయనున్నామని ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఠాణా పరిధి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చేయాలని సూచించారు.

అమ్మ ప్రేమ వెలకట్టలేనిది

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



వృద్ధులకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: సృష్టిలో అమ్మ ప్రేమ వెలకట్టలేనిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం యూవైసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండల పరిధి లింగారెడ్డిగూడ శివారులోని ఎఫ్‌సీఎస్ ఫౌండేషన్‌లో అనాథ వృద్ధులకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో అమ్మ అనే పిలుపు ఒక అందమైన అనుభూతి అన్నారు. మాతృ బంధం ఎంతో అద్భుతమైనదని, పిల్లల కోసం ఆమె పడే తపన వర్ణించలేనిదని పేర్కొన్నారు. సమాజంలో పిల్లలను ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో తల్లి కీలక పాత్ర పోషిస్తుందని, జీవితంలో ఆమె రుణం తీర్చుకోలేనిదని స్పష్టంచేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. నాయకులు బాబర్‌ఖాన్, విశాల శ్రావణ్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, ఇబ్రహీం, ఖదీర్, ఆలియా సుల్తానా, రఘునాయక్, సబియా సుల్తానా, యాస్మిన్, ఉస్మాన్, సోహెల్, మతానీ, సయ్యద్ సయాద్, అర్బాజ్, ఫౌండేషన్ నిర్వాహకులు గీతా థామస్ పాల్గొన్నారు.

అతివలు అన్ని రంగాల్లో రాణించాలి

షాద్‌నగర్: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బీసీసేన మహిళా మండల అధ్యక్షురాలు జక్కుల జలజ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం పరిధి కందివనం గ్రామంలో సేన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా.. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని సూచించారు. స్త్రీలు సంఘటితంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. కమిటీ మహిళా అధ్యక్షురాలిగా కావలి అనురాధ, ప్రధాన కార్యదర్శిగా యాదమ్మ, పలువురు సభ్యులను నియమించారు. అనంతరం నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.



నియామక పత్రాలు అందుకుంటున్న నూతన కమిటీ సభ్యులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న పండితులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గంగాభవాని కాలనీలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు సుప్రభాతం, ధ్వజారోహనం, అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, హనుమాన్‌హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణయ్య, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సత్తయ్య, కోశాధికారి సాయికుమార్, సభ్యులు పరమేశ్, అప్పి, సుధాకర్, లింగం, ఈశ్వరయ్య, యాదగిరి, లింగప్ప, అశోక్ ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న నాయకులు

కడ్తాల్: గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని 12,13 వార్డుల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం గూడూరు మాట్లాడుతూ.. డ్రైనేజీ పనులను పూర్తి చేసి, వినియోగంలోకి తెస్తామని పేర్కొన్నారు. మండలంలో సీడీఎఫ్, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.1.30 కోట్లతో సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజేశ్, మాజీ సర్పంచ్ చెన్నయ్య, నాయకులు శ్రీను, రమేశ్, భానుకిరణ్, మహేశ్, శ్రీకాంత్, రామకృష్ణ, నరేశ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి



అబ్దుల్లాపూర్‌మెట్: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్: ఆత్మీయ పలకరింపులు, భావోద్వేగాల నడుమ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009- 10 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు.. సుదీర్ఘ కాలం అనంతరం పాఠశాల వేదికగా సందడి చేశారు. బాల్యం జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ కేరింతలు కొట్టారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు రంగారెడ్డి, శ్రీనివాస్, యాదయ్య గౌడ్, జంగాచారి, గోదాదేవి, గీతా శ్యామల, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పోల్కంపల్లిలో..



ఇబ్రహీంపట్నం రూరల్‌లో..

ఇబ్రహీంపట్నం రూరల్: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. మండల పరిధి పోల్కంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల (2007- 08 విద్యాసంవత్సరం) టెన్త్ విద్యార్థులు 17 ఏళ్ల అనంతరం ఒకే వేదికగా సందడి చేశారు. చిననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయురాలు వసంత రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ ఏడాదైనా..



అసంపూర్తిగా నూతన డిగ్రీ కళాశాల భవనం



2016లో మంత్రి కేటీఆర్ వేసిన శిలాఫలకం

విద్యకు పెద్దపీట వేస్తూ 2008లో నాటి ప్రభుత్వం ఇబ్రహీంపట్నానికి డిగ్రీ కళాశాల మంజూరు చేసింది. అనంతరం 2016లో అప్పటి సర్కారు నూతన భవన నిర్మాణానికి తగిన నిధులు కేటాయించింది. నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసింది. కానీ నేటి వరకు భవనం పూర్తికాలేదు.

- డిగ్రీ కళాశాల భవనం ప్రారంభానికి నోచుకునేనా?
- 2008లో వైఎస్‌ఆర్ మంజూరు..
- 2016లో కేటీఆర్ శంకుస్థాపన
- నేటికీ కొనసాగుతున్న నిర్మాణ పనులు

ఇబ్రహీంపట్నం: విద్యా రంగానికి ప్రాధాన్యమిస్తూ 2008లో నాటి ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి.. ఇబ్రహీంపట్నానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుచేశారు. అనంతరం వినోబానగర్‌లో 5 ఏకరాల విస్తీర్ణంలో రూ.2 కోట్ల 25 లక్షల వ్యయంతో భవన నిర్మాణానికి 2016 డిసెంబరులో అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరితో కలిసి శంకుస్థాపన చేశారు. ఐదేళ్ల అనంతరం స్లాబ్ వరకు నిర్మాణం చేసి వదిలివేశారు. మూడేళ్ల క్రితం నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించినా పూర్తి కాలేదు.

మూడేళ్లుగా ఊరిస్తూ..

మూడేళ్లుగా రేపుమాపంటూ ఊరిస్తున్న పాలకులు.. కళాశాల భవనాన్ని వినియోగంలోకి తేవడంలో విఫలమయ్యారు. బీఆర్‌ఎస్ హయాంలో సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి యేడాదిన్నర గడిచింది. ప్రస్తుతం కళాశాల ముందు భాగం ప్రహరీని నిర్మించారు. మరో మూడు వైపులా ఫెన్సింగ్ పనులు చేపట్టాల్సి ఉంది.

ప్రస్తుత ఏడాదిలో నైనా..

ఆన్‌లైన్‌లో దోస్త్ ద్వారా డిగ్రీలో సీట్ల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. వచ్చే నెలలో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం నాటికి నూతన భవనం సిద్ధమవుతుందా లేదా అనే సందేహం కలుగుతోంది. కళాశాల భవనం చుట్టూ ప్రహరీతో పాటు విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్, ల్యాబ్స్ తదితర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు నిధులు కేటాయించాల్సి ఉంది.

జూనియర్ కాలేజీలో డిగ్రీ

స్థానికంగా డిగ్రీ కళాశాల లేకపోవడంతో సుమారు 17 ఏళ్ల క్రితం నాటి ప్రభుత్వం కళాశాలను మంజూరు చేసింది. అనంతరం నిర్మాణ పనులకు మరో సర్కార్ శంకుస్థాపన చేసింది. కానీ నేటి వరకు భవనం పూర్తికాలేదు. డిగ్రీ కళాశాల మంజూరు నాటి నుంచి జూనియర్ కళాశాలలోనే షిఫ్ట్ విధానంలో ఇంటర్, డిగ్రీ తరగతులు కొనసాగుతున్నాయి. ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు ఇంటర్, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 వరకు డిగ్రీ తరగతులు జరుగుతున్నాయి. అయితే చాలీచాలని గదుల్లో విడతలుగా కొనసాగుతున్న తరగతులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఒకే గదిలో బాట్నీ, జియోలజీ ల్యాబ్స్, లైబ్రరీ, మరో గదిలో కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్‌లున్నాయి. ఆన్‌లైన్‌లో దోస్త్ ద్వారా డిగ్రీలో సీట్లు కేటాయిస్తుండంతో స్థానికులే కాక ఇతర జిల్లాలకు చెందిన వారు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. సొంత భవనానికి శంకుస్థాపన చేసి పదేళ్లు కావస్తున్నా.. పూర్తి స్థాయి నిర్మాణానికి నోచుకోలేదు.



పరిస్థితిలో మార్పులేదు



తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విద్యా వ్యవస్థలో మార్పులొస్తాయని భావించాం. కానీ ఎప్పటిలాగే ఉంది. డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి పదేళ్లు పూర్తికావస్తున్నా పాలకుల నిర్లక్ష్యం కారణంగా అది పూర్తికావడంలేదు. ఈ విద్యా సంవత్సరంలోనైనా వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– బోద వంశీ, ఎస్‌ఎఫ్‌ఐ, డివిజన్ అధ్యక్షుడు

ఉద్యమిస్తాం



బీఆర్‌ఎస్ హయాంలో కళాశాల భవన నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయి. మిగతా పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది. ఈ అకాడమిక్ ఇయర్‌లో డిగ్రీ కళాశాలను వినియోగంలోకి తేవాలి. లేని పక్షంలో విద్యార్థి సంఘాలతో కలిసి ఉద్యమిస్తాం.

– నిట్టు జగదీశ్, బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు

ప్రారంభిస్తాం

ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ కళాశాల సొంత భవనంలోకి మారుతుంది. అందుకు అవసరమైన సదుపాయాల కోసం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్‌కు విన్నవించాం. నిధులు కేటాయించారు. పనులు కొనసాగుతున్నాయి. త్వరలో కళాశాల చుట్టూ ఫెన్సింగ్ పనులు పూర్తవుతాయి.

– ప్రొఫెసర్ ఎస్.రాధిక, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఇబ్రహీంపట్నం